క్లుప్తంగా

దశమి ఉత్సవాలకు రాట ముహూర్తం



ఆలయం వద్ద దశమి ఉత్సవాల పందిరి రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో కొలువైన వేప చెట్టు కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను చేతుల మీదుగా రాట ముహూర్తం పూజలు చేశారు. కార్యక్రమంలో కల్వకొలను వీధి పెద్దలు బోణం శ్రీను, గోకరకొండ కుమార్, ఒంటెద్దు బాబు, కల్వకొలను ప్రసాద్, యాళ్ల గంగాధర రామారావు, బోణం సత్తిబాబు, ఉద్దిశ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం అమలాపురం ఎల్‌సీ ఎంఐ కేర్, రాజమండ్రి శ్రీరామ ఐ కేర్ అండ్ రెటీనా సెంటర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ప్రారంభించారు. శిబిరంలో సుమారు 200 మంది కంటి రోగులను ఆప్తాల్మిక్ డాక్టర్ నాగేష్ పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇసుకపట్ల రఘుబాబు, నిమ్మకాయల చెల్లయ్య నాయుడు, గొలకోటి చిన్న,చీకురుమిల్లి సత్యనారాయణ, యెరుబండి బుజ్జి, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో బాషా తదితరులు

అమలాపురం టౌన్: స్టేట్ బయో ఫోరం రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, డీసీబీ సెక్రటరీ హనుమంతరావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక ముక్తేశ్వరం రోడ్డులో డీఈవో క్యాంపు కార్యాలయంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో బాషా స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. స్టేట్ బయో ఫోరం జాయింట్ సెక్రటరీ కె.బాలకృష్ణ, జిల్లా బయో ఫోరం అధ్యక్షుడు కె.సాయిరామ్, ప్రధాన కార్యదర్శి ఏజీ కృష్ణ, జిల్లా ఎన్జీసీ కో ఆర్డినేటర్ జీఎస్‌వీ ప్రసాద్, బయోలిజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన ఆక్వా రైతులు

కాట్రేనికోన: విద్యుత్ శాఖ సిబ్బంది చెరువులు విద్యుత సర్వీసును తొలగించడంతో రొయ్యలు మృత్యువాత పడ్డాయనే ఆరోపణతో గురువారం టీడీపీ, జనసేన నాయకులు ఆధ్వర్యంలో ఆక్వా రైతులు కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లు చెల్లించినా సర్వీసు తొలగించడం వల్ల ఆక్సిజన్ స్థాయి పడిపోయి రొయ్యలు మృత్యువాత పడ్డాయని, సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. అయితే కాట్రేనికోన ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రూ.20వేల పైబడి పెండింగ్ బిల్లులు ఉన్న చెరువులకు మాత్రమే సర్వీసులను నిలిపివేశామన్నారు. నిలిపివేసిన గంటలో సదరు రైతు బిల్లు చెల్లించగా వెంటనే సర్వీసును పునరుద్ధరించామన్నారు.

ఆత్మహత్యల ర్యాంకులో పుదుచ్చేరికి మూడో స్థానం

యానాం: నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో స్టాటిస్టిక్స్ నివేదిక ఆత్మహత్యల్లో పుదుచ్చేరి దేశంలో 3వ స్థానంలో ఉందని పేర్కొంది. ఈ మేరకు బుధవారం పుదుచ్చేరి ఆరోగ్యశాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 7,20,000 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రిపోర్టు ప్రకారం భారతదేశంలో 2017 నుంచి 2022 వరకు ఆత్మహత్యల రేటు పెరిగిందన్నారు. పుదుచ్చేరిలో 26.3 శాతంతో 3వ స్థానంలో ఉందన్నారు. ఆత్మహత్యలకు ముఖ్య కారణాలుగా మాదక ద్రవ్యాలకు అలవాటు, స్కూల్ విద్యార్థుల్లో ఒత్తిడి, తల్లిదండ్రుల నుంచి ప్రేమ లోపించడం, కుటుంబ సమస్యలు అని పేర్కొన్నారు. ఎవరైనా భయం, ఆందోళన, నిరాశ, ఆత్మహత్య ఆలోచనలు వస్తే అటువంటి వారికి మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ హాట్‌లైన్ నెంబరు 14416కు, 18008914416ను సంప్రదించాలని కోరారు.

రైతులపై బీమా భారం

- పశువుల రక్షణకు కరవైన భరోసా
- పశు బీమాను గాలికొదిలేసిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో కేటాయించని నిధులు
- ఆవేదన చెందుతున్న రైతులు



నడవపల్లిలో పశువులను చూసుకుంటున్న రైతులు (ఫైల్)

కాట్రేనికోన: పశువుల బీమా పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పశువులకు రక్షణ ఉంటుంది. అయితే గత ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని అమలు చేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు విడుదల కాకపోవడంతో గాలికి వదిలేసింది. ఆ భారం అంతా రైతులపై పడింది. దీంతో వారు లబోదిబోమంటున్నారు. పశువుల బీమా పథకం పాడి రైతుల పాలిట ఆపద్బంధువుగా ఉండేదని, ప్రస్తుతం అది లేకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న సన్న, చిన్న కారులు రైతుల పశువులు ప్రమాదవ శాత్తు మరణిస్తే ఆర్థికంగా నష్టపోతున్నారనే ఉద్దేశంతో రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఐ.పోలవరంలో 11,186, ముమ్మిడివరంలో 10,700, కాట్రేనికోనలో 12,886 పశువులు ఉన్నాయి. ముమ్మిడివరం మండలంలో 4,400 ఆవులు, 4,200 గేదెలు, 2,100 గొర్రెలు ఉన్నాయి. ఐ.పోలవరంలో 4,144 ఆవులు, 4,654 గేదెలు, 867 గొర్రెలు, 1521 మేకలు, కాట్రేనికోన మండలంలో ఆవులు 5410, గేదెలు 4803, మేకలు 1533, గొర్రెలు 840, ఇతర పశువులు 300 పశువులు ఉన్నాయి. పశు సంవర్ధక శాఖ అధికారులు పాడిరైతులు వద్దకు వెళ్లి బీమా పథకంపై అవగాహన కల్పించి, చేయించే వారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో మొక్కుబడిగా చేపట్టి కొన్ని పశువులకు బీమా చేసి వదిలేసింది. పాడి రైతులకు భరోసా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పశుబీమా పథకం ఇలా

ఉత్పాదక దశలో ఉన్న 2-10 ఏళ్ళ వయస్సు లోపు ఆవులు, 3-12 ఏళ్ళు వయస్సు గేదేలకు రూ.30 వేలు, ఏడాదిన్నర వయస్సు ఉన్న మేలు జాతి ఎద్దులు, దున్నలకు రూ.30 వేలు, రెండేళ్ల పై బడిన ఎద్దులు, దున్నలు, నాటు ఆవులకు రూ.15 వేలు, ఆరు నెల వయస్సు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు రూ.6 వేలు చొప్పున బీమా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, తుపానులు, పాము కాటు, అడవి జంతువుల దాడి, పిడుగు పాటు, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదాలు, జబ్బుతో పశువులు మృత్యువాత పడితే బీమా పథకం వర్తిస్తుంది.

వర్తించనివి

పశువు యాజమాని ఉద్దేశ పూర్వకంగా హాని తలపెట్టినా, ఇతర బీమా ఏజెన్సీల్లో పశుబీమా చేయించినా, రాష్ట్ర, జాతీయ విపత్తుల ప్రతి స్పందన నిధి పరిధిలోనికి వచ్చే ప్రమాదాలకు బీమా వర్తించదు. 10 ఏళ్ల వయస్సు దాటిన ఎద్దులు, దున్నలకు, ఆరు నెలలు లోపు వయసు గొర్రెలు, మేకలు, పందులకు, శాశ్వత అంగవైకల్యం కలిగిన పశువులకు బీమా వర్తించదు.

> **ప్రీమియం చెల్లించాల్సిందే..**
>
> రైతులు పశుబీమా చెల్లించాలి. ఈ ఏడాది జనవరిలో కొన్న పశువులకు పశు బీమా చేశాం. ప్రస్తుతం పశు బీమా పథకంపై నిధులు కేటాయించాల్సి ఉంది. పశుబీమా చేసేందుకు నిధులు ప్రభుత్వం కేటాయిస్తే తప్పకుండా చేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతుల నుంచి బీమా ప్రీమియం సొమ్మును కట్టించుకుంటాం.
>
> – డా.సుధీర్, పశువైద్యాధికారి, కాట్రేనికోన ఇన్‌చార్జి

లబ్ధిదారులు చెల్లించాల్సిన ప్రీమియం

గత ప్రభుత్వంలో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే ప్రీమియంను చెల్లించింది. ప్రస్తుతం ఆ భారం రైతులపైనే పడింది. ఆవు, గేదెలకు ప్రీమియం రూ.15 వేలకు లబ్ధిదారుడి వాటాగా రూ.192, ప్రభుత్వం రాయితీ రూ.768గా ఉంటుంది. అలాగే రూ.30 వేలకు బీమాకు లబ్ధిదారుడి వాటా రూ.384, ప్రభుత్వ రాయితీ రూ.1536 చెల్లించాలి. మేకలు, గొర్రెలు, పందులకు ఏడాదికి ప్రభుత్వ రాయితీ రూ. 144 చెల్లించగా లబ్ధిదారుడి వాట రూ.36లు చొప్పున ఎస్సీ, ఎస్టీలు చెల్లించాలి. ఇతరులు ఆవులు, గేదెలకు రూ.15 వేలకు లబ్ధిదారుడి వాటా రూ.480 చెల్లించాలి. రూ.30వేలకు లబ్ధిదారుని వాటా రూ.960 చెల్లించాలి. అలాగే బీమా చెల్లింపులో ఎస్సీ, ఎస్టీలకు అయితే 80శాతం సబ్సిడీ కూడా ఉంటుంది.

మెడికల్ కాలేజీల ‘ప్రైవేటు’ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన జిల్లా బీఎస్పీ

అమలాపురం టౌన్: మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోషే, అమలాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పొలమూరి మోహనబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన ముఖ్యంగా బహుజన విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలారంలో బీఎస్పీ నాయకులు జాన్‌మోషే, మోహన్ బాబు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. పీపీపీ విధానంలో సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి మినహా బహుజనుకులకు ఎంత మాత్రం న్యాయం జరగదని ఆరోపించారు. ప్రైవేటీకరణ వల్ల వైద్య సీట్లన్నీ రూ.కోట్లలో అమ్ముకునే అక్రమాలకు ఈ ప్రభుత్వం తెర తీసిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అన్ని రంగాల్లోనూ ప్రైవేటీకరణ వైపు అడుగులు వేసి తన కోటరీని బాగుచేసుకుంటారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే బీఎస్పీ ఆందోళనకు దిగుతుందని జిల్లా అధ్యక్షుడు జాన్ మోషే, మోహన్‌బాబు హెచ్చరించారు.

వినాయక చవితి ఉత్సవ కమిటీలకు పురస్కారాలు



బాల విద్యార్థి గణపతి కమిటీ ప్రతినిధులకు పురస్కారం అందిస్తున్న రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను వినూత్నంగా నిర్వహించిన కొన్ని కమిటీలకు రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ పురస్కారాలు అందించేందుకు ఎంపిక చేసింది. జిల్లో ఏడు కమిటీలను ఎంపిక చేయగా అందులో స్థానిక గ్రాండ్ పార్కులో రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన ఉత్సవ కమిటీలకు పురస్కారాలను గురువారం అందజేసింది. అమలాపురం పట్టణం ముమ్మిడివరం గేటు సెంటరులో బులియన్ అసోసియేషన్ (షరాబుల పందిరి) ఆధ్వర్యంలో జరిగిన వినాయక ఉత్సవాల కమిటీ, స్థానిక దుడ్డివారి అగ్రహారంలో బాల విద్యార్థి గణపతి కమిటీ, స్థానిక గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయం ఆధ్వర్యంలో జరిగిన వినాయక ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఉన్నారు. వారికి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కమిటీ అధ్యక్షుడు గుత్తుల భాను ప్రకాష్ చేతల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. జిల్లాలో ఏడు వినాయ చవితి ఉత్సవ కమిటీలకు పురస్కారాలు అందిస్తే అందులో మూడు పురస్కారాలు అమలాపురం పట్టణంలోని మూడు కమిటీలకు దక్కాయి.

సంస్కార భారతి వ్యాస రచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ



వ్యాస రచన పోటీల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతిని అందుకుంటున్న దేదీప్య

అమలాపురం టౌన్: విశ్వనాథ సత్యనారాయణ జయంతిని ఆంధ్ర సాహిత్య దినోత్సవంగా ఈనెల 10వ తేదీన సంస్కార భారతి రాష్ట్ర శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో అమలాపురం నెహ్రూ సెంటినరీ స్కూల్ విద్యార్థిని తోట దేదీప్య రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. విశ్వనాథ సత్యనారాయణ రచించిన ‘ఆంధ్ర ప్రశస్తి’ కావ్యంలోని ‘దేశ భక్తి’ అనే అంశంపై సంస్కార భారతి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో దేదీప్య విజేతగా నిలిచింది. ఇటీవల సంస్కార భారతి జిల్లా శాఖ అమలాపురంలో వ్యాస రచన పోటీల్లో నిర్వహించగా దేదీప్య జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని గెలుచుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. రాష్ట్ర స్థాయి విజేత అయిన దేదీప్య రూ.3 వేల నగదు బహుమతిని కూడా గెలుచుకుంది. విద్యార్థినిని సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, అమలాపురం ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆకొండి పవన్, నెహ్రూ సెంటినరీ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నరసింహారావులు అభినందించారు. విజయవాడలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభలో దేదీప్య ప్రథమ బహుమతిని అందుకుంది.

సంస్కార భారతి పద్య పఠనం పోటీల్లో ప్రథమ స్థానం



బహుమతి అందుకుంటున్న పద్య పఠనం రాష్ట్ర విజేత విద్యార్థిని చంద్రమణి

సంస్కార భారతి రాష్ట్ర శాఖ నిర్వహించిన పద్య పఠనం పోటీల్లో అమలాపురం శ్రీవాగ్దేవి స్కూలు విద్యార్థిని అదితే చంద్రమణి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఆమెను శ్రీవాగ్దేవి స్కూల్ డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి, సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

అల్లవరం: మండలంలోని సచివాలయాల ఉద్యోగులు అల్లవరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాలను క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి ఉద్యోగులను బదిలీలు చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగులు క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని, వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మణరావుకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సచివాలయాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

భీమాబాయి మహిళా మండలి సేవలు భేష్

ఘనంగా మహిళా మండలి 30వ వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోరంగి ఎస్ఐ సత్యనారాయణ

తాళ్లరేవు: మహిళాభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న భీమాబాయి మహిళా మండలి సేవలు అభినందనీయమని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ కొనియాడారు. గురువారం మహిళా మండలి 30వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలు అందిస్తూ, మహిళల అభివృద్ధికోసం నిరంతరం పాటు పడుతున్న మహిళా మండలి ప్రతినిధులను అభినందించారు. మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ రెండు జిల్లాలో సుమారు 160 గ్రామాల్లో మహిళల అభివృద్ధికి, పలు దీర్ఘకాల వ్యాధుల బాధితులకు తమ సంస్థ సేవలందిస్తుందన్నారు. హెచ్ఐవీ బాధితులకు క్రమం తప్పకుండా పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. గత 30 ఏళ్లుగా మహిళా మండలికి ఆర్థిక సహకారం అందిస్తున్న సంస్థలకు నందివర్ధన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లోవకిశోర్, ఏపీఎం షైనీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకరత్నం, ప్రతినిధులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు నూతన పాలక వర్గం ఎంపిక

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి(ట్రస్ట్‌బోర్డు)ని నియమిస్తూ గురువారం విజయవాడలోని ఎండోమెంట్స్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా పది మందిని నియమించారు. చైర్మన్‌గా దాట్ల రామకృష్ణంరాజు ఎంపిక చేయగా సభ్యులుగా పెద్దింటి మారుతి శ్రీవాణి, పెన్మెత్స రామరాజు, త్సవతపల్లి నాగేంద్రరావు, కర్రి చంద్రశేఖర్, విత్తనాల సత్యనారాయణ, గంగుల జయలక్ష్మి, గొల్లవిల్లి సునీత, పతి సీతా మహాలక్ష్మి, మద్దాల వెంకటేశ్వరరావులను నియమించారు. పేటేటి వీర వెంకట సుబ్బారావు, అర్చకుడు ఎక్స్–అఫీషియోగా ఉండనున్నారు. వీరి పదవీ కాలం నియామకకాలం నుంచి రెండు సంవత్సరాలపాటు కొనసాగుతుంది.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ శాంతలక్ష్మి

అల్లవరం: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే వ్యాధులకు దూరంగా ఉంటామని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి అన్నారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని గౌతమినగర్, జైభీమ నగర్‌లో చెత్త సేకరణను గురువారం ఆమె సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఇళ్లల్లో ఉండే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటిని సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని పారిశుధ్య కార్మికులకు సూచనలు చేశారు. వీధుల్లో చెత్త చెదారం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆదిశంకరం, గ్రేడ్–5 కార్యదర్శి దూనబోయిన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబరు 5ను రద్దును చేయాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఎస్సీలకు సంక్షేమ పథకాల వర్తింపునకు, ఇంటిస్థలం విస్తీర్ణానికి ముడిపెట్టడంతో పలువురు యానాంలో ఎస్సీలు ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా అమలు జరిగే పథకాలకు అనర్హులుగా అవుతుండటంతో వారు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలకు ఇంటి స్థలం 83 చదరపు మీటర్ల విస్తీర్ణం దాటితే వారికి సుమారు 8 పథకాలు వర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో నివేశన స్థల పట్టా సైతం రాని పరిస్థితితోపాటు వివాహం చేసుకునే అమ్మాయిలకు, గర్భిణులకు, దీర్ఘకాలికక వ్యాధిగ్రస్తుల ఆర్థిక సాయం అందడంలేదన్నారు. శానిటరీ లేవెట్రిన్స్ నిర్మాణసాయం, చనిపోయినవారికి మట్టిఖర్చులసాయం, ప్రకృతి వైపరీత్యాల, అగ్ని ప్రమాదాల్లో సాయం, దీపావళి సంక్రాంతి ఉచిత దోవతులకు ఇచ్చే నగదు తదితర పథకాలు వర్తించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం దీపావళికి ప్రతి ఏటా ఎస్సీలకు ఉచిత దుస్తులకు ఆర్థిక సహాయం అందజేసే వారు. ఈ నిబంధనలు అమలులోకి రావడంతో ఎంత మంది అర్హత పొందుతారో తెలియకుండా ఉందని స్థానిక దళిత నాయకుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఆర్ఏఓ గిడ్డి బలరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం జీఓ నంబరు 5ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పుదుచ్చేరి ఆదిద్రావిడశాఖ నుంచి పూర్తిస్థాయిలో ఆదేశాలు రానందున జిఓ అమలుపై యానాం అధికారులు ఎస్సీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

మామిడికుదురు: పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో 100 శాతం మార్కులు సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈవో బాషా సూచించారు. ఆయన గురువారం నగరం జెడ్పీ హైస్కూల్‌తో పాటు ప్రధాన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పదో తరగతిలో సి, డి గ్రేడ్ విద్యార్థులపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వారి సామర్థ్యాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఇటీవల ఇచ్చిన మూల్యాంకనం పుస్తకాలను పరిశీలించారు. స్కూల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్‌ఎంలు సోమేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చినబొడ్డు వెంకటాయపాలెంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

తాళ్లరేవు: వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఈశ్వర్ ఆదేశాల మేరకు హెచ్‌వి లక్ష్మి, ఏఎన్ఎం అచ్యుత, ఎంఎల్‌హెచ్‌పీ సింధూ, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉంచకుండా చూడాలని కోరారు. ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వీఏఓ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



రాతపరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ అంకిత్‌కుమార్

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(వీఏఓ) పోస్టుల భర్తీకి ఈనెల 21న ఆదివారం నిర్వహిస్తున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆర్ఏఓ అంకిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన రాత పరీక్షా కేంద్రాలైన రీజెన్సీ పబ్లిక్ స్కూల్ తదితర కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లను రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, హెచ్ఎం టీపీఎస్ఎస్‌పీ ప్రసాదరావు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



అధికారులకు ఆదేశాలిస్తున్న ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్



కూలిన ఇళ్ల వద్ద సేవలందిస్తున్న సిబ్బంది



సిద్ధంగా అగ్నిమాపకదళ సిబ్బంది

- సునామీ వస్తే ఇలా కాపాడుకోవాలి
- ఆలోచింపజేసిన మాక్ డ్రిల్
- పాల్గొన్న ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ తదితర శాఖలు

యానాం: సునామీ వంటి పరిస్థితులను ప్రజలు ఏ విధంగా ఎదుర్కోవాలోనని యానాంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జాతీయ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా మాక్‌డ్రిల్ చేసి చూపించారు. సునామీ వచ్చే సమయంలో ప్రజలు, సంస్థలు, అధికారులు ఎలా స్పందించాలో సాంకేతిక శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. గతంలో సునామీ(భారీ కెరటాలు) వచ్చిన తీరప్రాంత గ్రామాలైన గిరియాంపేట, సావిత్రీనగర్‌లలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు గురించి గ్రామస్తులకు వివరించారు. సునామీ సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆస్తుల పరిరక్షణ, వైద్యబృందాల ఆధ్వర్యంలో వైద్య సేవలు, అంబులెన్స్‌లు ద్వారా గాయ పడినవారిని అత్యవసర చికిత్సలకు తరలించడం, సముద్రంలో కొట్టుకుపోతున్న బాధితులను రక్షించి తీరానికి తీసుకురావడం తదితర వాటిని గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ మాట్లాడుతూ సునామి మాక్ డ్రిల్ వల్ల ప్రజల భద్రత, సన్నద్ధత మెరుగుపరుచుకోవచ్చన్నారు. ముందుగా విపత్తు సమయంలో తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలుసుకోవచ్చని, లోపాలను గుర్తించి సరిచేసుకోవచ్చన్నారు. గిరియాంపేట ప్రభుత్వ హైస్కూల్ కేంద్రంగా నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపకదళం, పీడబ్ల్యూడీ, ఆరోగ్య తదితర శాఖలు, డీటీ వెంకటేశ్వరరావు, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, కోస్టల్ ఎస్సై కవల రవణమూర్తి, సీఐ అడలరసన్, ఎస్సైలు పునీత్‌రాజ్, శేరు నూకరాజు, జ్యోతిరాజు, ఐటీఐ వలంటీర్లు పాల్గొన్నారు.